సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం, 1, ఏప్రిల్, 2025



ఆంధ్రాలో అమ్మకం
తెలంగాణలో చోరీ చేసిన వస్తువులను ఆంధ్రప్రదేశ్‌లో విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. - 8లో



ఇరువర్గాల మధ్య ఘర్షణ
ఇద్దరు యువకుల మధ్య క్రికెట్ విషయంలో మొదలైన తగువు ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. - 8లో



గిరిపుత్రుల ప్రతిభ
గిరిజన విద్యార్థులు వ్యవసాయంలో ఉపయోగపడే పరికరాలు తయారు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు యాదగిరిగుట్టకు మంత్రి కోమటిరెడ్డి

యాదగిరిగుట్ట: రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం యాదగిరిగుట్టకు రానున్నారు. రేషన్‌కార్డు దారులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేయన్ను సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆలేరు నియోజకవర్గంలో ఆయన ప్రారంభిస్తారు. ఉదయం 10.30గంటలకు యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి గార్డెన్స్‌లో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా హాజరు కానున్నారని, పార్టీ కార్యకర్తలతో పాటు అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

గుట్ట శివాలయంలో సంప్రదాయ పూజలు



శివాలయంలో స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. సోమవారం శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో రోజూవారీ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, అర్చన చేసి కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపం, ముఖ మండపంలో సుదర్శనహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు.

11న బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ

ఆలేరురూరల్ : బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ ఈనెల 11వ తేదీన ఆలేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని చెప్పారు. విజయోత్సవ సభకు సంబంధించిన వివరాలను రెండు, మూడు రోజుల్లో వెల్లడిస్తామని తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ ఆలేరు పట్టణ అధ్యక్షుడు ఎంఏ.ఎజాజ్, బాలరాజు, నాయకులు పాల్గొన్నారు.



ఆలేరు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎంపీ

ఈద్-ఉల్-ఫితర్



రంజాన్ సందర్భంగా సోమవారం భువనగిరిలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఈద్గా వద్ద ముస్లింలతో భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు

వడ్డీ మాఫీ చేసినా.. వసూల్లేవ్!

భువగిరి టౌన్ : ఆదాయం సమకూర్చుకునేందుకు మున్సిపాలిటీల్లో మొండి బకాయిల వసూలుకు ప్రభుత్వం ప్రకటించిన వన్‌టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్)కు ఆశించిన స్థాయిలో స్పందన కనిపించ లేదు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను బకాయిలను 90శాతం వడ్డీ మాఫీతో చెల్లించే అవకాశం ప్రభుత్వం కల్పించినా బకాయిదారులు ముందుకు రాలేదు. మార్చి 31 అర్ధరాత్రితో గడువు ముగియగా.. చివరి రోజు భువనగిరి మున్సిపాలిటీలో బకాయి చెల్లింపుదారులు 20 మంది లోపే ఉన్నారు. మార్చి చివరి వారంలో వడ్డీ మాఫీ ప్రకటించడంతో చాలా మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారని తెలుస్తోంది. రెండు వారాల ముందు ప్రకటించి, బకాయిదారులకు అవగాహన కల్పించి ఉంటే కొంత వరకు సత్ఫలితం ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లక్ష్యానికి మించి 'ఉపాధి'

నిర్దేశిత పని దినాలు 27.49లక్షలు.. కూలీలకు కల్పించినవి 28.37 లక్షలు

- మండుటెండలను లెక్కచేయకుండా పనులకు హాజరైన కూలీలు
- దినసరి వేతనం సగటున రూ.277
- పనులు కల్పించడంలో రాష్ట్రంలో జిల్లా నాలుగో స్థానం

సాక్షి, యాదాద్రి : ఉపాధిహామీ పనుల కల్పనలో జిల్లా రికార్డు సృష్టించింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను 27.49 లక్షలకు గాను 28.37లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రస్థాయిలో నాలుగోస్థానంలో నిలిచింది. కూలీలకు దినసరి వేతనం సగటున రూ.277 చెల్లించారు.

వెనుకబడినా పుంజుకుని..

కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించడంలో అధికారులు సఫలీకృతం అయ్యారు. రెండు నెలల క్రితం వరకు వెనకబడి ఉన్నప్పటికీ ఆ తరువాత ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఆ శాఖ ఉన్నత, మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించడంతో పాటు అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించారు. అంతేకాకుండా వర్షాలు తక్కువగా కురువడంతో చేతినిండా వ్యవసాయ పనులు లేక జనం ఉపాధి బాట పట్టడం కూడా పనిదినాలు అధికంగా నమోదు కావడానికి కారణమైంది. ఒక్కో కుటుంబానికి ఏడాదిలో 100 రోజుల పని కల్పించాల్సి ఉంది.



భువనగిరి సమీపంలో ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్న కూలీలు

కూలీలు	పనులకు హాజరైన కూలీలు
2.63 లక్షలు	1.38 లక్షలు
పని దినాల లక్ష్యం	**కల్పించిన పని దినాలు**
27.49 లక్షలు	28.37 లక్షలు

జిల్లాలో 1.43 లక్షల జాబ్ కార్డులకు గాను 2.63లక్షల మంది కూలీలు ఉన్నారు. ఇందులో ప్రస్తుతం 94వేల యాక్టివ్ జాబ్‌కార్డులు ఉండగా 1.38 కూలీలు పనులకు హాజరయ్యారు. ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 27,79,000 పనిదినాలు కల్పించాలని అధికారులు నిర్ణయించి 28,37,000 పని దినాలు కల్పించారు. ఇందుకోసం రూ.110.82 కోట్లు ఖర్చు చేశారు. ప్రతి కూలీకి దినసరి వేతనం రూ.300 నిర్ణయించగా, సగటున రూ.277 చెల్లించారు.

చేపట్టిన పనులు ఇవీ..

ఉపాధిహామీ పథకంలో భాగంగా అభివృద్ధికి దోహదపడే పనులు ఎక్కువగా చేపట్టారు. బీడు భూముల అభివృద్ధి, చెరువులు, కుంటలు, ఫీడర్ చానళ్లలో పూడికతీత, పాంపాండ్, ఇంకుడు గుంతల నిర్మాణాలు, గొర్రెల పెంపకం, వ్యవసాయ అనుబంధ రహదారుల నిర్మాణం.. ఇలా 266 రకాల పనులు ఉన్నాయి.

మెటీరియల్ కాంపొనెంట్ కూడా..

అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు వంటి 40 శాతం మెటీరియల్ కాంపొనెంట్ పనులు కూడా ఉపాధిహామీలో చేశారు. రూ.43 కోట్ల విలువ చేసే పనులు జరిగాయి.

సమష్టి కృషితోనే సాధ్యమైంది

2024–25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పించాం. ఒక్కో కుటుంబానికి 103 రోజులు పనిదినాలు కల్పించి లక్ష్యాన్ని అధిగమించాం. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్దేశించిన పనులన్నీ పూర్తి చేశాం. కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాం. సమష్టి కృషితోనే సాధ్యమైంది.

–నాగిరెడ్డి, డీఆర్‌డీఓ

ఆఖరి రోజు 110 రిజిస్ట్రేషన్లు

రంజాన్ రోజున కూడా పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

- మార్చి 29వ తేదీ వరకు 1,418 ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్
- సాధారణ రోజులతో పోలిస్తే సోమవారం కాస్త ఎక్కువగా..
- నల్లగొండలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నిల్

నల్లగొండ : ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు సోమవారం కాస్త పెరిగాయి. అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) కింద మార్చి 31వ తేదీవరకు ఫీజు చెల్లించేవారి 25 శాతం రాయితీ ఇచ్చింది. ఆ అవకాశాన్ని పలువురు సద్వినియోగం చేసుకున్నారు. రంజాన్ పండుగ సెలువు దినం అయినా.. సోమవారం రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పని చేశాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్చి 29వ తేదీవరకు 1,418 ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌కాగా.. సోమవారం మాత్రం 110 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. కొన్ని కార్యాలయాల్లో ఒక్క డాక్యుమెంట్ కూడా రిజిస్ట్రేషన్ కాకపోవడం గమనార్హం.

ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లింపు..

అనుమతి లేని వెంచర్లు, వ్యవసాయ భూముల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఆయా ప్రాంతాల విలువను బట్టి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ ఇచ్చింది. మార్చి 31వ తేదీ వరకు గడువు విధించింది. దీంతో గడిచిన నెల రోజుల నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు మున్సిపాలిటీ, పంచాయతీల్లో ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లిస్తున్నారు. అయితే గతంలో రిజిస్ట్రేషన్ చేసుకోనివారు.. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించడంతోపాటు రిజిస్ట్రేషన్లు కూడా చేసుకుంటున్నారు.

ప్రభుత్వానికి ఆదాయం

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుపై రాయితీ గడువు మార్చి 31వ తేదీతో ముగుస్తుండడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకుంటారని భావించిన ప్రభుత్వం రంజాన్ సెలవు దినం రోజున కూడా కార్యాలయాలను తెరిచి ఉంచింది. దీంతో సోమవారం ఉమ్మడి జిల్లా పరిధిలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 110 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. గడిచిన నెల రోజుల్లో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్న రిజిస్ట్రేషన్ల కంటే చివరి రోజు కాస్త పెరిగాయి. దీంతో ప్రభుత్వానికి ఒక పక్క ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ద్వారా, రిజిస్ట్రేషన్ రూపంలో ఆదాయం సమకూరింది.



నల్లగొండలో సోమవారం ఖాళీగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయం

ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ వివరాలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	మార్చి 29వరకు	31 తేదీన	మొత్తం రిజిస్ట్రేషన్‌లు
భువనగిరి	114	8	152
బీబీనగర్	132	8	140
చౌటుప్పల్	25	5	30
మోత్కూర్	30	0	30
రామన్నపేట	38	6	44
యాదగిరిగుట్ట	225	8	233
చండూరు	23	0	23
దేవరకొండ	72	0	72
మిర్యాలగూడ	81	0	81
నల్లగొండ	68	0	68
నకిరేకల్	65	48	113
నిడమనూరు	81	4	85
హుజూర్‌నగర్	26	1	27
కోదాడ	159	1	160
సూర్యాపేట	2 49	21	270
మొత్తం	1418	110	1528

ఐదు కార్యాలయాల్లో నిల్..

అయితే సోమవారం ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్క డాక్యుమెంట్ కూడా రిజిస్ట్రేషన్ కాలేదు. వాటిలో మోత్కూర్, చండూరు, దేవరకొండ, మిర్యాలగూడ, నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. చివరి రోజు అధికంగా నకిరేకల్ సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో 48 డాక్యుమెంట్లు, సూర్యాపేటలో 21 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయి.

శోభాయాత్రను విజయవంతం చేయాలి



హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ దళ్ నాయకులు

భువనగిరిటౌన్ : విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ), భజరంగదళ్ ఆధ్వర్యంలో ఈనెల 12న భువనగిరిలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నామని వీహెచ్‌పీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తోట భానుప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సోమవారం హనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను ఆయా సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి హిందువు శోభాయాత్రలో పాల్గొని విజయవంత చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌సీ జిల్లా కార్యదర్శి సుక్కల శ్రీశైలం యాదవ్, కోశాధికారి చామ రవీందర్, సామాజిక సమరసత కన్వీనర్ కేమోజు మల్లికార్జునచారి, లీగల్ సెల్ కన్వీనర్ సాల్వేరు వేణు, భువనగిరి పట్టణ అధ్యక్షుడు కందికొండ సహదేవ్, సత్సంగ్ ప్రముఖ్ వల్లబోజు సతీష్, భజరంగదళ్ జిల్లా కన్వీనర్ బింగి భరత్‌కుమార్, భువనగిరి పట్టణ కన్వీనర్ నమిలె నవీన్, హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు దేవరకొండ నరసింహాచారి, భువనగిరి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రత్నపురం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

5న జగ్జీవన్‌రామ్, 14న అంబేద్కర్ జయంతి

భువనగిరి టౌన్ : మహనీయుల జయంతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రామ్, 14వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు అన్ని వర్గాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించనున్నట్లు వివరించారు. గ్రామాల్లోనూ జగ్జీవన్ రామ్, అంబేద్కర్ విగ్రహాలను అలంకరించి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహనీయుల జయంతి ఉత్సవాలపై ఇప్పటికే కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులతో సమావేశం అయ్యారని, మరోసారి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

పింఛన్.. ప్రతి నెలా టెన్షన్

- మార్చి నెల గడిచినా అందని ఫిబ్రవరి పింఛన్



సాక్షి యాదాద్రి : యాదగిరిగుట్ట మండలం మహబూబ్‌పేటకు చెందిన గాజుల ఐలమ్మ అనే వృద్ధురాలికి ప్రభుత్వం ఇచ్చే ఆసరా పింఛనే ఆధారం. ప్రతి నెలా వచ్చే డబ్బులతో ఇంట్లో సరుకులు కొనుగోలు చేసి జీవనం సాగిస్తోంది. ఫిబ్రవరి పింఛన్ ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. రోజూ ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చే వ్యక్తి కోసం నిరీక్షించి వెళ్తోంది. ఇటువంటి పరిస్థితినే మరెందరో ఎదుర్కొంటున్నారు.

1,60,021 మంది లబ్ధిదారులు

యాదాద్రి జిల్లాలో ఆసరా లబ్ధిదారులు 1,60,021 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా ప్రభుత్వం రూ.24.85 కోట్లు పంపిణీ చేస్తోంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదని, రెండుమూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని డీఆర్‌డీఓ నాగిరెడ్డి తెలిపారు.

వాన నీటిని ఒడిసిపడదాం..

నీటి సంరక్షణకు ప్రణాళికలు

- పీఎం కృషి సంచాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) 2.0 ద్వారా వాటర్‌షెడ్
- తొలుత కరువు ప్రాంతాల్లో అమలు
- జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా సంస్థాన్ నారాయణపురం మండలం
- రూ.9.42 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్

సంస్థాన్ నారాయణపురం : వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నాయి. భవిష్యత్తులో వచ్చే నీటి సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పటికే అనేక పథకాలు అమలు చేయగా.. తాజాగా పీఎం కృషి సంచాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) 2.0 పథకానికి శ్రీకారం చుట్టాయి. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ ప్రాంతాలను గుర్తించి ఈ పథకం అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని జనగాం కేంద్రంగా ఈ పథకానికి కార్యరూపం ఇస్తున్నారు. ఈ మండలంలో భూగర్భ జలాలు 28 అడుగుల లోతుకు పడిపోవడంతో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు.

పడిపోయిన భూగర్భ నీటి మట్టం

సంస్థాన్నారాయణపురం మండలంలో భూగర్భ జలాలు 24 మీటర్ల లోతుకు పడిపోయాయి. సాధారణంగా 8 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండాలి. కానీ, 16 మీటర్లు తక్కువగా ఉంది. ఇది జిల్లాలోనే తీవ్ర కరువు పరిస్థితులు కల్గిన ప్రాంతంగా కేంద్రం గుర్తించింది. గత కొన్ని సంవత్సరాలుగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదవుతోంది. ఈ సంవత్సరం 854 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 540 మి.మీ కురిసినట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. పంటల దిగుబడి తక్కువగా ఉండటం, వేసవిలో నీటి కొరత అధికంగా ఉండటంతో వాటర్ షెడ్ ప్రాజెక్టు పథకంలో చేర్చారు.



పోర్లగడ్డలో నిర్మించిన పర్క్యులేషన్ ట్యాంకు



జనగాంలో రైతు యాదయ్య వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు వేసిన ఊటకుంట

10వేల ఎకరాలకు ఉపయోగపడేలా కార్యాచరణ

వాటర్‌షెడ్ ప్రాజెక్టులో భాగంగా రానున్న ఐదేళ్లలో జనగాం, పుట్టపాక, వావిళ్లపల్లి, చిల్లాపురం, కొత్తగూడెంతో పాటు మరో 11 గ్రామ పంచాయతీల పరిధిలో 10వేల ఎకరాలకు వాటర్‌షెడ్ ఉపయోగపడేలా కార్యాచరణ చేపట్టారు. ఇందుకు గాను రూ.9.4 కోట్లు కేటాయించగా.. ఇపపటికే రూ.90 లక్షలు ఖర్చు చేశారు.

వాటర్‌షెడ్‌పై అవగాహన కార్యక్రమాలు

వాటర్‌షెడ్‌పథకంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు తొలుత గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇటీవల పుట్టపాక, జనగాంలో వాటర్ షెడ్ యాత్ర నిర్వహించారు. పథకం ఉద్దేశం వివరించేందుకు విద్యార్థులు, గ్రామస్తులతో ర్యాలీలు చేపట్టారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.


మహిళా సంఘాల భాగస్వామ్యం

వాటర్‌షెడ్ పథకంలో మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వాములను చేస్తున్నారు. సంఘాల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు రుణాలు అందజేస్తున్నారు. జనగాం వాటర్‌షెడ్ పథకంలోని మహిళా సంఘాలకు రూ.1.40 కోట్లు అందజేశారు. ఈ రుణాలతో కుట్టు మిషన్లు, పిండి గిర్నీ, కిరాణ షాపులు, వస్త్ర దుకాణాలు, పశువుల పెంపకంతో స్వయం ఉపాధి పొందుతున్నారు.

రైతులకు ప్రోత్సాహం

వాటర్‌షెడ్ పథకంలో రైతులను భాగస్వాములను చేయడానికి వారికి వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తూ చైతన్యం తీసుకువస్తున్నారు. వాటర్‌షెడ్ పథకం ద్వారా వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు రూ.1.41కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో కల్లం పట్టాలు, తైవాన్ స్ప్రేయర్లు, మినీ పవర్ వీడర్, పవర్ టిల్లర్, గొర్రు, కల్టివేటర్లు తదితర వ్యవసాయ యంత్ర పరికరాలు కొనుగోలు చేయనున్నారు.

నీటిని నిల్వ చేసేలా నిర్మాణాలు చేపట్టాలి



వాన నీరు వృథాగా పోకుండా అన్ని వాగుల్లో చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతలు, ఊట కుంటలు నిర్మాణం చేయాలి. నీటి వృథాను అరికట్టేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. మొక్కలను సంరక్షించేలా ప్రోత్సహించాలి.

–నెలికంటి రాములు, రైతు, పుట్టపాక

డీపీఆర్ రూపొందిస్తున్నాం

గతంలో ఉన్న మార్గదర్శకాల్లో కొద్దిపాటి మార్పులు చేసి పీఎంకేఎస్‌వై 2.0 పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. సంస్థాన్ నారాయణపురం మండలంలోని జనగాం ప్రాజెక్టు పరిధిలో ఐదేళ్ల కాలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాలకు సంబంధించి డీపీఆర్ రూపొందిస్తున్నాం. దీనికి ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన వెంటనే ఆయా పంచాయతీల్లో వాటర్‌షెడ్ కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకుంటాం.

–నాగిరెడ్డి, డీఆర్‌డీఓ

చేపట్టే పనులు ఇవీ..

ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలోకి ఇంకేలా చేస్తారు. ఇందుకోసం వర్షం నీరు వృథాగా పోకుండా చెక్‌డ్యాంలు, ఊట చెరువులు, నీటి నిలువ కుంటలు, పొలాల నుంచి మట్టి కొట్టుకుపోకుండా అడ్డుగా రాతి కట్టలు, కందకాల తవ్వకం, పర్క్యూలేషన్ ట్యాంకులు, ఊటకుంటలు, డగ్ అవుట్ పాండ్స్ (వాగుల్లో నుంచి వచ్చే నీరు నిల్వ చేసేందుకు తవ్వే కుంటలు), వాగులో ఇంకుడు గుంతలు, రైతువారీ కుంటలు నిర్మాణం చేసి నీటిని ఇంకిచడం, నిల్వ చేయ్యడం చేస్తారు. రోడ్లకు ఇరువైపులా, వాగులు, వంకల వెంట మొక్కలు అనేక రకాల మొక్కలు నాటి పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ చేపడతారు. తద్వారా వర్షపాతాన్ని పెంచే ప్రయత్నం చేస్తారు. వాటర్‌షెడ్ పథకం కింద పండ్ల తోటల పెంపకం, ప్రజల జీవనోపాధుల పెంపునకు సంబంధించిన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. ఇప్పటి వరకు జనగాం ప్రాజెక్టు పరిధిలో 68 పనులు చేపట్టి పూర్తి చేసినారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


విఘ్నేష్

చౌటుప్పల్ : పట్టణ కేంద్రలోని బీసీ కాలనీలో నివాసం ఉండే సూరపల్లి విఘ్నేష్(47) అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విఘ్నేష్‌కు కొంతకాలంగా మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చూపించి మందులు వాడుతున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కొంతసేపటి తర్వాత తల్లి గౌరమ్మ వెతికినా విఘ్నేష్ ఆచూకీ లభించలేదు. తెలిసినవారిని ఆరా తీసినా ఆచూకీ తెలియకపోవడంతో గౌరమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మన్మథకుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు దుర్మరణం

వేములపల్లి : గుర్తు తెలి యని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన వేములపల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పుట్టల కృష్ణయ్య(49) ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డు దాటుతుండగా మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కృష్ణయ్య తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కృష్ణయ్య మృతదేహాన్ని కాగా మృతుడికి భార్య జయలలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

చిట్యాల: వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చిట్యాల పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా గల జంక్షన్ ఎదుట సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మునుగోడు మండలం చొల్లేడు గ్రామానికి చెందిన పరమేష్ బైక్‌పై చిట్యాలకు కూరగాయలు కొనుగోలు చేయడానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో చిట్యాల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై జంక్షన్ దాడుతుండగా హైదరాబాద్ నుంచి నార్కట్‌పల్లి వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. పరమేష్ తలకు తీవ్ర గా యాలు కావడంతో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

బైక్ ఢీకొని మహిళకు..

హుజూర్‌నగర్‌రూరల్ : బైక్ ఢీకొట్టడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాత్రి హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కావలి మండలం మునగదిన్నె గ్రామానికి చెందిన బోనకుర్తి ఆదిలక్ష్మి తన కుటుంబ సభ్యులతో కలిసి బాతులను మేపుకోవడానికి హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం శివారులోని ముత్యాల బ్రాంచ్ కెనాల్ కట్టపై గుడిసె వేసుకుని ఉంటున్నారు. కాగా మేళ్లచెర్వు గ్రామానికి చెందిన రణబోతు శ్రీను మరో వ్యక్తితో కలిసి హుజూర్‌నగర్ నుంచి మేళ్లచెర్వుకు బైక్‌పై వెళ్తుండగా బైక్ లైట్ ఆకస్మాత్తుగా ఫెయిల్ అయింది. ఈ క్రమంలో చీకట్లో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న ఆదిలక్ష్మిని బైక్ ఢీ కొట్టడంతో ఆమె తలకు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను వెంటనే హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు.

గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్ట్

బీబీనగర్: మండల కేంద్రంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు మార్గంలో భారత్ గ్యాస్ గోదాం సమీపంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా భట్టుగూడెం గ్రామంలో ఏడుగురు యువకులు గంజాయికి అలవాటుపడి డబ్బుల కోసం ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగిలిస్తున్నారు. వారిని గ్రామస్తులు ఆదివారం పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

తెలంగాణలో చోరీ.. ఆంధ్రాలో అమ్మకం

- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- ట్రాక్టర్లు, ట్రాలీలు, కల్టివేటర్లు, వ్యవసాయ పరికరాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు


వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

త్రిపురారం : పగలు గ్రామాల్లో రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో ట్రాక్టర్లు, ట్రాలీలు, కల్టివేటర్లు, వీల్స్ దొంగిలించి తెలంగాణ రాష్ట్రం దాటించి ఆంధ్రప్రదేశ్‌లో అమ్మి సొమ్ము చేసుకుంటున్న నలుగురు దొంగల ముఠాను త్రిపురారం పోలీసులు పట్టుకున్నారు. సోమవారం త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో హాలియా సీఐ జనార్దన్‌గౌడ్, ఎస్ఐ వై.ప్రసాద్‌తో కలిసి మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు వివరాలు వెల్లడించారు. నిడమనూరు, త్రిపురారం మండలాల్లో ట్రాక్టర్లు, ట్రాలీలు, వ్యవసాయ పరికరాల దొంగతనాలు పెరగడంతో ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. ఆదివారం త్రిపురారం మండలంలోని అంజనపల్లి గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా వేముల నాగరాజు తన స్వరాజ్ ట్రాక్టర్‌పై కల్టివేటర్, ఆఫ్ వీల్స్, ట్రాక్టర్ గొర్రు వేసుకుని వస్తున్నాడు. ట్రాక్టర్ ముందు పల్సర్ బైక్‌పై పాల్తి తండాకు చెందిన డేగావత్ బాబునాయక్, ట్రాక్టర్ వెనకాల తిప్పర్తి మండలంలోని రామారం గ్రామానికి చెందిన ఎరకల శివ, బొర్రాయిపాలెం గ్రామానికి చెందిన గద్దల రాజీవ్ పల్సర్ బైక్‌పై వెళ్తున్నారు. త్రిపురారం ఎస్ఐ ప్రసాద్‌కు అనుమానం వచ్చి వారిని ఆపి విచారించడంతో వ్యవసాయ పరికరాలు దొంగిలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. అంజనపల్లి గ్రామానికి చెందిన వేముల నాగరాజు పాల్తితండాకు చెందిన డేగావత్ బాబునాయక్, ఎరకల శివ, గద్దల రాజీవ్, బొంత శంకర్, ఓగ్గు నవీన్‌ల సహకారంతో దొంగతనాలకు పాల్పడుతున్నామని ఒప్పుకున్నారు. దొంగిలించిన వాహనాలు, వస్తువులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమ్మి వచ్చిన డబ్బులు నలుగురు పంచుకున్నట్లు ఒప్పుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. దొంగతనానికి గురైన ట్రాక్టర్లు, ట్రాలీలు, వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేసిన వారిని నుంచి స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దొంగతనానికి గురైన సమయలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదు ప్రకారం వారి వస్తువులను వారికి అప్పజెప్పనున్నారు. నిందితులను పట్టుకున్న హాలియా సీఐ జనార్దన్ గౌడ్ టీం త్రిపురారం ఎస్ఐ వై ప్రసాద్, పీసీఆర్ శ్రీనివాస్, పీసీఎస్ శ్రీను, హెచ్‌జీ చాంద్ పాష, హెచ్‌జీ నర్సింహ, పీసీలు నవీన్‌రెడ్డి, రాము, రాంబాబు, మణిరత్నం పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

'సాక్షి'కి బాధితులు అభినందనలు

త్రిపురారం మండల వ్యాప్తంగా దొంగతనాలు పెరగడంతో ఈ నెల 19వ తేదీన సాక్షి దినపత్రికలో త్రిపురారంలో దొంగల భయం అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎస్పీ మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు పర్యవేక్షణలో హాలియా సీఐ జనార్దన్ గౌడ్‌తో త్రిపురారం ఎస్ఐ వై ప్రసాద్ సిబ్బందితో ఓ టీం ఏర్పాటు చేశారు. వారు నలుగురు దొంగలను అరెస్ట్ చేసి దొంగతానికి గురైన వాహనాలు, పని ముట్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. త్రిపురారం మండలంలో జరుగుతున్న దొంగతనాలపై సాక్షి దినపత్రిక వెలుగులోకి తేవడంతో బాధితులు సాక్షి కి అభినందనలు తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ, కేసులు నమోదు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఇద్దరు యువకుల మధ్య క్రికెట్ విషయంలో మొదలైన తగువు ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. గృహోపకరణాలు, మోటారు సైకిళ్లను ధ్వంసం చేసుకున్నారు. ఈ సంఘటన చింతలపాలెం మండలం కిష్టాపురంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపురం గ్రామానికి చెందిన యువకులు సుల్తాన్, జమాల్‌సైదా ఇద్దరు స్నేహితులు. క్రికెట్ విషయంలో ఇరువురి మధ్య తగవు జరిగింది. ఇది పెద్దలకు చేరడంతో వారు సర్దిచెప్పి పంపే క్రమంలో ఓ పార్టీకి చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో గ్రామస్తుడు చప్రాసి సైదాకు గాయాలు కావడంతో ఇరువర్గాల వారు ఒకరి ఇళ్లపై మరొకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో పలువురి ఇళ్లలోని ఫ్రిజ్‌లు, టీవీలు, మంచాలు ధ్వంసమయ్యాయి. రెండు బైకులు పూర్తిగా.. మరో 3 బైకులు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఈ దాడుల్లో ఇరువురికి బలంగా, మరో నలుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. గాయాలైనవారిని కోదాడ, ఖమ్మం ఆస్పత్రులకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి ఆధ్వర్యంలో ఇరువర్గాలకు చెందిన దాదాపు 20 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.


ధ్వంసమైన గృహోపకరణాలు

గ్రామాన్ని సందర్శించిన డీఎస్పీ

ఘర్షణలు జరిగిన కిష్టాపురం గ్రామాన్ని సోమవారం డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి సందర్శించారు. సంఘటన జరిగిన ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ఎవరు కూడా పుకార్లు నమ్మవద్దని, శాంతి భద్రతలకు సహకరించాలన్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.


వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐ

భార్య మెడ కోసి హత్య చేసిన భర్త

గుర్రంపోడు : కట్టుకున్న భర్తే కాలయముడై భార్య మెడ కోసి దారుణంగా హత్య చేసిన ఘటన గుర్రంపోడు మండలంలోని తెరాటిగూడెం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుప్పెల్లి అరుణ(40)ను ఆమె భర్త కిరణ్ ఇంట్లో మధ్యాహ్నం వేళ కత్తితో మెడ కోసి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో అరుణ ఇంటి బయట పడిపోగా చుట్టుపక్కలవారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భార్యాభర్తల మధ్య గొడవతోనే ఈ దారుణం జరిగినట్లు భావిస్తున్నారు. గుర్రంపోడుకు చెందిన దుప్పెల్లి కిరణ్‌తో 12 సంవత్సరాల క్రితం కన్నెబోయిన అరుణకు ప్రేమ వివాహం జరిగింది. వీరికి నాలుగు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. కొన్ని సంవత్సరాలు గుర్రంపోడులో వీరి సంసారం సాఫీగా సాగింది. ఆ తర్వాత వీరు తెరాటిగూడెంకు మకాం మార్చగా అప్పటి నుంచి తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. హత్యకు ముందు ఇంట్లో నుంచి గొడవ జరిగినట్లు అరుపులు వినిపించాయని స్థానికులు చెబుతున్నారు. మృతురాలి అక్క కొడుకు కన్నెబోయిన శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఇన్‌చార్జ్ సీఐ డి.రాజు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం అరుణ మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి పంపించామని, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బొమ్మలరామారం : మండలంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండలం ఖాజీపేట శివారులో షామీర్‌పేట వాగులో డొంకెన కిష్టయ్య వ్యవసాయ భూమి వద్ద ఓ నీటికుంటలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం పడిఉన్నట్లు సోమవారం పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి ఎస్ఐ శ్రీశైలం చేరుకుని మృతదేహం పడిఉన్న పరిసరాలను పరిశీలించారు. కుంటలో మృతదేహం తోపాటు చేపల వలలు లభించాయని, చేపల వేటకోసం వచ్చి ఈత రాక నీటిలో మునిగిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు నలుపు రంగు షర్టుపైన పెసర రంగు టీ షర్టు, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఇటుక బట్టీల్లో పనిచేసే వలస కార్మికుడిగా భావిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటాయని, మూడు రోజుల క్రితం చేపల వేటకు వచ్చి కుంటలో పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు 8712662474 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డీజిల్ ట్యాంక్ లీకై రేంజ్ రోవర్ కారు దగ్ధం

- కారులో నుంచి సురక్షితంగా బయటపడిన యువకులు


రోడ్డుపై దగ్ధమవుతున్న కారు

నార్కట్‌పల్లి : రేంజ్ రోవర్ కారు డీజిల్ ట్యాంకు లీకేజీ కావడంతో మంటలు ఎగిసిపడి కారు దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం నార్కట్‌పల్లి–అద్దంకి హైవేపై నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు వద్ద జరిగింది. హైదరాబాద్‌కు చెందిన శివప్రసాద్, శివకుమార్, గోవర్ధన్‌లు ముగ్గురు స్నేహితులు కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. సోమవారం అద్దంకి వద్ద పెట్రోల్ బంక్‌లో రేంజ్ రోవర్ కారుకు పెట్రోల్ పోయించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు సమీపంలోకి రాగానే రేంజ్ రోవర్ కారు డీజిల్ ట్యాంక్ లీకై చిన్నచిన్న మంటలు రావడంతో కారులో ప్రయాణిస్తున్న యువకులు గుర్తించారు. అప్రమత్తమైన ఆ యువకులు కారును రోడ్డు పక్కన నిలిపి కారులో నుంచి బయటకు వచ్చారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సంఘటన స్థలం వద్దకు చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది ఎగిసిన పడుతున్న మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు చాలా వరకు కాలిపోయింది. నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ ఘటనా స్థలం వద్దకు చేరుకుని పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మద్యం మత్తులో ఎలుకల మందు తాగిన వ్యక్తి మృతి


అలకుంట్ల భిక్షం

హుజూర్‌నగర్ : మద్యం మత్తులో ఎలుకల మందు తాగిన వ్యక్తి మృతి చెందిన సంఘటన హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాంనగర్ కాలానికి చెందిన అలకుంట్ల భిక్షం (39) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 29 బాగా మద్యం సేవించిన భిక్షం.. భార్యను భయపెట్టాలనే ఉద్దేశంతో ఎలుకల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే తాను ఎలాంటి మందు తాగలేదని చెప్పడంతో భిక్షంను ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం భిక్షం ఇంటి వద్ద వాంతులు చేసుకున్నాడు. దీంతో అతడిని స్థానిక ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఆదివారం మెరుగైన చికిత్స నిమిత్తం అతడిని ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భిక్షంకు భార్య నిరోషా, ఇద్దరు కూతుళ్లు స్రవంతి, మనీషా ఉన్నారు. సోమవారం పెద్ద కుమార్తె దేరంగుల స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ బస్సు కండక్టర్

చౌటుప్పల్ : ప్రయాణికురాలు మరిచి పోయి బ్యాగును గుర్తించిన కండక్టర్ కంట్రోలర్‌కు అప్పగించి నిజాయితీని చాటుకుంది. వివరాలు.. దిల్‌సుఖ్‌నగర్ బస్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం ప్రయాణికులతో చౌటుప్పల్‌కు వస్తోంది. ఓ ప్రయాణికురాలు దిల్‌సుఖ్‌నగర్‌లో బస్సు ఎక్కి కండక్టర్ ప్రవీణ వద్ద చౌటుప్పల్‌కు టికెట్ తీసుకుంది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో చౌటుప్పల్‌లో బస్సు దిగి వెళ్లిపోయింది. అయితే బస్సులో బ్యాగు ఉండడాన్ని కండక్టర్ గుర్తించి దాన్ని చౌటుప్పల్ బస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన కంట్రోలర్ నాగేష్‌కు అప్పగించింది. సాయంత్రం తిరిగి వచ్చిన ఆ ప్రయాణికురాలు కంట్రోలర్‌ను సంప్రదించింది. తన బ్యాగు, అందులోని వివరాలను తెలియజేసింది. కంట్రోలర్ విచారించి బ్యాగు ఆమెదే అని నిర్ధారించుకున్నాడు. అదే బస్సు సాయంత్రం బస్‌స్టేషన్‌కు వచ్చిన సమయంలో కండక్టర్ ప్రవీణతో కలిసి బ్యాగును అప్పగించాడు. అందులో 15 తులాల వెండి ఆభరణాలు, నడుము వడ్డాణంతోపాటు నగదు ఉన్నాయి. కాగా ప్రయాణికురాలి బ్యాగును నిజాయితీగా అప్పగించిన కండక్టర్ ప్రవీణతోపాటు కంట్రోలర్ నాగేష్‌ను పలువురు అభినందించారు.


ప్రయాణికురాలికి బ్యాగు అప్పగిస్తున్న కండక్టర్

కష్టానికి ఫలితం.. ర్యాంకులు సొంతం

పేదింట మెరిసిన విద్యాకుసుమం


శ్రావ్య

మునగాల: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన గ్రూప్–1 ఫలితాల్లో మునగాల మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన మేడం సుజాత–వెంకన్న దంపతుల కుమార్తె శ్రావ్య 516.5 మార్కులతో రాష్ట్రస్థాయిలో 12వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు. శ్రావ్య ప్రాథమిక, హైస్కూల్ విద్య మఠంపల్లి మండలంలోని గురుకుల విద్యాలయం, కోదాడ పట్టణంలోని వైష్ణవి పాఠశాలలో చదివింది. ఇంటర్ కోదాడలోని లక్ష్య జూనియర్ కళాశాలలో, బీటెక్ జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్‌లో చదివింది. అనంతరం హైదరాబాద్‌లో ఉండి సొంతంగా గ్రూప్–1కు ప్రిపేర్ అయి పరీక్షలకు హాజరైంది. రాష్ట్రస్థాయిలో 12వ ర్యాంకు సాధించిన శ్రావ్యకు డిప్యూటీ కలెక్టర్ ర్యాంక్ ఉద్యోగం లభించే అవకాశాలు ఉన్నాయని పలువురు విద్యావేత్తలు తెలిపారు. రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన శ్రావ్యను గ్రామస్తులు అభినందించారు.

ఎన్ని ఉద్యోగాలు వచ్చినా వదిలేసి..


కొత్తపల్లి ఖుషీల్‌వంశీ

భానుపురి (సూర్యాపేట) : ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన గ్రూప్–1 ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన కొత్తపల్లి ఖుషీల్‌వంశీ సత్తాచాటాడు. 496 మార్కులతో జనరల్ ర్యాంక్‌లో 63వ స్థానంలో, రిజర్వేషన్‌లో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచాడు. సీపీఐ మాస్‌లైన్ పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్–రేణుక సంతానమైన ఖుషీల్‌వంశీ ఇప్పటికే ఎస్ఐతోపాటు యూపీఎస్సీలో ఇన్‌కమ్ ట్యాక్స్ అసిస్టెంట్, మిలటరీ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. కానీ ఏ ఉద్యోగంలో జాయిన్ కాలేదు. ఎలాగైనా కలెక్టర్‌గా ప్రజలకు సేవలందించాలనే తపనతో తన చదువును కొనసాగించాడు. గతేడాది జరిగిన యూపీఎస్సీలో సెంట్రల్ పోలీస్ అసిస్టెంట్ కమాండో (డీఎస్పీ)గా ఎంపికయ్యాడు. ఏప్రిల్ 19న జాయిన్ కావాల్సి ఉండగా ఇంతలోనే గ్రూప్–1 ఫలితాలు వచ్చాయి.

రాష్ట్రస్థాయిలో 257వ ర్యాంక్ సాధించిన సందీప్


సందీప్‌కుమార్‌కు స్వీట్ తినిపిస్తున్న తండ్రి వెంకటాద్రి

తిరుమలగిరి : మండల కేంద్రానికి చెందిన పత్తి సందీప్‌కుమార్ గ్రూప్–1 ఫలితాల్లో 468.5 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో 257వ ర్యాంక్, మల్టీజోన్–2 లో (ఎస్సీ) రిజర్వేషన్‌లో 15వ ర్యాంకు సాధించాడు. సందీప్‌కుమార్ 2020వ సంవత్సరంలో బీటెక్ పూర్తి చేశాడు. అప్పటి నుంచి సివిల్స్‌కు శిక్షణ తీసుకుంటున్నాడు. ఒక సంవత్సరం ఢిల్లీలో శిక్షణ తీసుకున్న అనంతరం హైదరాబాదులో ప్రిపేర్ అవుతున్నాడు. తండ్రి వెంకటాద్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, తల్లి లలిత హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. భవిష్యత్‌లో సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని సందీప్ తెలిపాడు. ఈ విజయం తన అమ్మానాన్నలదే అని పేర్కొన్నారు. ప్రస్తుతం వచ్చిన ర్యాంకు ప్రకారం డీఎస్పీ కానీ సీటీఓ ఉద్యోగం కానీ వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ గ్రూప్–1 కు ఎంపిక

- గ్రూప్ –1లో 384 ర్యాంక్ సాధించిన వట్టె రాజశేఖర్‌రెడ్డి


వట్టె రాజశేఖర్‌రెడ్డి

మేళ్లచెరువు : ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన వట్టె రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 384 వ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు. చిన్నతనంలోనే తండ్రి మృతిచెందగా తల్లి విద్యా వలంటీర్‌గా విధులు నిర్వహిస్తూ ఇద్దరు కుమారులను కష్టపడి చదివించింది. మొదటి కుమారుడైన రాజశేఖర్‌రెడ్డి ముందునుంచి చదువులో ప్రతిభ కనబరిచేవాడు. పదో తరగతి వరకు మేళ్లచెరువు మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించాడు. బాసర ట్రిపుల్‌ఐటీలో బీటెక్ పూర్తి చేశారు. సొంతంగా చదువుతూ పది సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలు రాశాడు. ఇటీవల గ్రూప్–4 లో ర్యాంకు సాధించి కోదాడ మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రాజశేఖర్‌రెడ్డి గ్రూప్–1 సాధించడంపై గ్రామస్తులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

యాదగిరిగుట్ట: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన సోమవారం తుర్కపల్లి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన తూటి రామయ్య (86) గ్రామ శివారులోని చెరువు వద్ద నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో కాశీరెడ్డిపల్లి నుంచి ఎదురుగా వస్తున్న కారు రామయ్యను అతివేగంగా ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన రామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు జహంగీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాలనర్సింహ వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భువనగిరి జిల్లా కేంద్రం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఏఎమ్మార్పీ కాల్వలో పడి వ్యక్తి గల్లంతు


అంజయ్య

పెద్దఅడిశర్లపల్లి : ప్రమాదవశాత్తు ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలో పడి వ్యక్తి గల్లంతైన సంఘటన గుడిపల్లి మండలంలో సోమవారం చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి మండలంలోని సింగరాజుపల్లి గ్రామానికి చెందిన వట్టిపు అంజయ్య(35) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం సమీప బంధువు అయిన ఎల్ల య్యతో కలిసి గ్రామ శివారులోని ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలో స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు కాలు జారి కాల్వలో పడిపోయాడు. అంజయ్యను వెంటనే ఎల్లయ్య రక్షించే ప్రయత్నం చేయగా అప్పటికే అంజయ్య గల్లంతయ్యాడు. దీంతో అంజయ్య కుటుంబ సభ్యులకు, గుడిపల్లి పోలీసులకు ఎల్లయ్య సమాచారం అందించాడు. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీటి విడుదలను నిలిపివేయించారు. గాలింపు చర్యలు చేపట్టగా రాత్రి వరకు మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు.

అత్తవారింట్లో ఆత్మహత్య

కల్లూరు రూరల్: సూర్యాపేటకు చెందిన చెన్నం ప్రమోద్(36) ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని రావికంపాడు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రమోద్ రావికంపాడులోని అత్తగారింటికి కొద్దిరోజుల క్రితం వచ్చాడు. సోమవారం తన మామ మైలవరపు శ్రీనివాసరావు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. పోలీసులు మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

గిరిపుత్రుల ప్రతిభ

- ఎలక్ట్రికల్ నానో ట్రాక్టర్ రూపొందించిన గిరిజన విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించి ప్రశంసలు అందుకున్న తరుణ్, అఖిల్



నానో ట్రాక్టర్ రూపొందించిన అఖిల్, తరుణ్, గైడ్ టీచర్ నవీన్‌కుమార్, ఇన్‌సెట్‌లో నానో ట్రాక్టర్

యాదగిరిగుట్ట: వ్యవసాయానికి ఉపయోగపడే పరికరాన్ని రూపొందించి తమ ప్రతిభను చాటుకున్నారు ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి గిరిజన విద్యార్థులు బానోతు తరుణ్, లునావత్ అఖిల్. తమకు చదువు చెబుతున్న ఉపాధ్యాయుడు కోట నవీన్ కుమార్‌ను గైడ్‌గా చేసుకుని చోటా ప్యాకెట్ బడా ధమాకా పేరుతో ఎలక్ట్రికల్ నానో ట్రాక్టర్ తయారు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకున్నారు.

మొదటి ప్రయత్నంలోనే..

లూనావత్ అఖిల్, బానోతు తరుణ్‌లు ఉపాధ్యాయుడు కోట నవీన్ కుమార్ సహకారంతో 2024 జనవరిలో ఎలక్ట్రికల్ నానో ట్రాక్టర్‌ను తయారు చేసేందుకు ప్రయత్నం ప్రారంభించారు. దీనిని పూర్తి చేసి అదే సంవత్సరం సెప్టెంబర్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించగా.. రాష్ట్ర స్థాయికి ఎంపిక అయింది. అదేవిధంగా జనవరి 7న హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ప్రదర్శించగా జాతీయ స్థాయికి ఎంపికైంది. వికసిత్ భారత్‌లో భాగంగా జనవరి 10, 11, 12తేదీల్లో ఢిల్లీలో జరిగిన యంగ్ ఇండియా ఫెస్టివల్‌లో ఈ పరికరాన్ని ప్రదర్శించారు.

నానో ట్రాక్టర్ పనితీరు..

బ్యాటరీతో నడిచే మినీ ఎలక్ట్రికల్ నానో ట్రాక్టర్‌ను పాత పనిముట్లతో రూపొందించారు. అంతర పంటలు వేసుకునేందుకు ఉపయోగపడే విధంగా దీనిని రూపొందించారు. చిన్న, సన్నకారులు రైతులు అతి తక్కువ పెట్టుబడితో వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా ఈ నానో ట్రాక్టర్‌ను వినియోగించవచ్చు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించా

అఖిల్, తరుణ్‌ల ప్రతిభను గుర్తించాను. వారికి వచ్చిన ఆలోచనతో ఎలక్ట్రికల్ నానో ట్రాక్టర్‌ను రైతుల కోసం రూపొందించాలని నిర్ణయించుకున్నాం. మినీ వాహనాన్ని తయారు చేసి బ్యాటరీని అమర్చి అంతర పంటలకు ఉపయోగపడే విధంగా రూపొందించాం. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి నిరంతరం కృషి చేస్తా.

– కోట నవీన్‌కుమార్, ఉపాధ్యాయుడు